

# మంచితనం

"ఈయన రామశాయి. కలెక్టరాఫీసులో పని చేస్తున్నారు. కొత్తగా ట్రాన్స్‌ఫర్ అయి ఈ ఊరు వచ్చారు." రామశాయిని తన మిత్రులకి పరిచయం చేశాడు ఆనందరావు. రామశాయి ఎర్రగా, పలచగా, పొడుగ్గా ఉంటాడు. కోల ముఖం, లోతుకు పోయిన కళ్ళు.

"ఇతను కృష్ణప్రసాద్. కాలేజీలో ఇంగ్లీషు డిపార్టుమెంటులో జూనియర్ లెక్చరర్. విప్లవ కవి. చాలా కాగితాలు పాడు చేశాడు. ఈ మహానుభావుడు సత్యనారాయణ. ఇక్కడ రాజా అండ్ రాజా కంపెనీలో క్లర్క్. మోడర్న్ ఆర్ట్ అంటూ పిచ్చి గీతలు గీస్తాడు."

పరస్పర కరచాలనాలు జరిగాయి.

"రామశాయి కొత్తగా ఈ ఊరు వచ్చారని చెప్పాను కదూ? ఈ నగరంలో మూడు రోజుల పాటు అద్దె ఇంటి కోసం విఫల యత్నం చేశాడు. నాకు మార్కెట్‌లో తారసపడి ఏదైనా అద్దె ఇల్లు చూసి పెట్టమని అడిగాడు. వేరే గది దొరికేదాక మన రూమ్‌లో ఉండమని నేను ఆహ్వానించాను." అసలు విషయాన్ని సూటిగా చెప్పాడు ఆనందరావు.

"ఆయన ఈ రూమ్‌లో ఎడ్జస్టు అవగలరో లేదో?" సత్యం అనుమానాన్ని వెలిబుచ్చాడు.

"రూమ్ అనకు. ఇదొక బందులదొడ్డి. ఒక విధంగా చెప్పాలంటే ఇరుకు బందులదొడ్డి. ఇలాగ చెప్పి మిమ్మల్ని బెదరగొట్టాలన్నది నా ఉద్దేశ్యం కాదు. మీకు వేరే గది దొరికేదాకా మీరు

పిమాత్రం మొహమాటం లేకుండా ఉండవచ్చు" అన్నాడు కృష్ణప్రసాద్.

"అవును. మీరు మాకు గెస్ట్‌గా ఉండవచ్చు" అన్నాడు సత్యం.

"థాంక్యూ వెరీ మచ్! మీ సహాయాన్ని మరవలేము" అన్నాడు రామకాంతు.

"ఫర్వాలేదు. కాని, మీ ఫామిలీని తీసుకురావడం వీలు పడదేమో? మీకు మారేజ్ అయిందా?"

"లేదండి!" అని సమాధాన మిచ్చాడు రామకాంతు.

• • •

మిత్రబృందం ఉంటున్న రూమ్ ఒక్క రూమ్ మాత్రమే కాదు. దాని పక్కనే చిన్న రూమ్ మరొకటి ఉంది. దాన్ని డ్రెస్సింగ్ రూమ్‌గాను, స్టోర్ రూమ్‌గానుకూడా ఉపయోగిస్తారు. ఆ రెండు గదులు కలిపి అద్దె డెబ్భై అయిదు రూపాయలు. ఇంటి యజమాని ఆచారి గట్టివాడు. అందుకే అయిదో తారీఖు పొద్దున్న కల్లా మిత్రబృందం ఇంకా ముఖాలు కడుక్కోకుండానే వచ్చాడు.

"ఏమిటండి, ఆచారిగారూ, ఇలా వచ్చారు?" నోట్లోని బ్రష్ తీసి అడిగాడు కృష్ణప్రసాద్.

"ఏమీలేదు. గది మీకు సౌకర్యంగా ఉందో లేదో చూసిపోదామని. . ." పలికాడు ఆచారి.

"గది మాట కొస్తే ఇది ఒక చిన్న బందురదొడ్డి. మేం ఎలాగో పశువుల్లాగ బతికేస్తున్నాం."

ఆచారి మాట్లాడకుండా అక్కడున్న కుర్చీ మీద కూర్చున్నాడు.

"గది బాగా పరిశీలిస్తున్నా రేమిటి? ఇంద్రభవనంలా మెరిసిపోతోందా?" వక్రోక్తిగా అన్నాడు కృష్ణప్రసాద్.

"చిత్తం. తమరు పరసం బాగా ఆడతారు."

"చంపారు! నేను పరవ మూర్ఖ మేమిటి—నే పరిశే విరసం (విప్లవ రచయితల సంఘం)కి సెక్రటరీని."

ఆచారి కృష్ణప్రసాద్ వించి తప్పించు కోవడానికి— "ఏమండీ, ఆనందరావు గారూ, జీతా లిచ్చారా?" అన్నాడు.

"ఇచ్చారండి." జవాబిచ్చాడు కృష్ణప్రసాద్.

"అయితే, మా అద్దె ఇచ్చేస్తారన్న మాట?"

"ఏం అద్దె!" విచిత్రంగా చూశాడు కృష్ణప్రసాద్.

"అదే—ఆ మూడు పాలికలు!"

"అలాటి మాట నా దగ్గిర మళ్ళీ అనకండి. మీ రిచ్చిన కోడి గదికి అద్దె ఇవ్వాలా? అద్దె ఇవ్వం. చెప్పుకోండి— ఎవరితో చెప్పుకుంటారో! ఇది సోషలిస్టు రాజ్యం. ఈ గదిని అనుభవించడానికి అందరికీ హక్కుంది."

ఆచారి కృష్ణప్రసాద్ మాటల్ని పట్టించుకోలేదు. ఆయనకి ప్రసాద్ ధోరణి అలవాటే!

ఇంతలోనే సత్యం వచ్చి ఆయనకి అద్దె ఇచ్చేశాడు. ఆచారి దాన్ని బొడ్లో పెట్టుకుని వెళ్ళిపోయాడు.

"అద్దె ఇవ్వాలట అద్దె! పరమ గది ఇచ్చాడు మహా. దీన్ని చూస్తే ఎవరేనా పాడెట్టిన కొంప అనుకుంటారు గాని, మనుషులు బతుకుతున్నదని అనుకోరు. ఓ వెల్గా లేదు, ఏమీ లేదు, మళ్ళీ అద్దె పుచ్చుకోవడానికి అయిదో తారీఖు కల్లా సిద్ధం. . ."

అతని దీర్ఘోపన్యాసం టక్కున ఆగి పోవటానికి కారణం రామకాంతు వేలితో రెపరెప లాడుతున్న రూపాయలు.

'ఏమిటిది?' అన్నట్టు చూశాడు సత్యం.

"రామకాంతుగారూ, మీ దగ్గిర డబ్బు లున్నాయని మాకూ తెలుసు. కాని, ఆ రూపాయలు మాత్రం తీసేయకోండి. మీరు ఈ గదిలో మాకు అతిథిగా ఉంటున్నారన్న సంగతి మరిచిపోకండి. ఇంటి అద్దెలో మీరు భాగం ఇవ్వక్క ర్లేదు" అన్నాడు కృష్ణప్రసాద్.

"మీరు నన్ను ఇబ్బంది పెడ్తున్నారు. ఇంటద్దె తీసుకోరు. రోజా పొద్దున్నా, సాయంకాలం కాఫీ, అప్పు డప్పుడు టిఫినూ... ఏమిటిది? నే నిక్కడ ఉండటం మీ కిష్టం లేదా?" కోపంగా అడిగాడు రామకాంతు.

కృష్ణప్రసాద్ అతని మాటల్ని వెంటనే ఖండించాడు. "మీకే ఇష్టం ఉన్నట్టు లేదు. నేను మీకు ముందరే చెప్పాను మీరు మా గెస్ట్ అని. గెస్ట్ దగ్గిర డబ్బు తీసుకోవడం మా ఆచారం కాదు. కాబట్టి అలాటి పని చేసి మమ్మల్ని కించపరచకండి."

రామకాంతు జవాబు చెప్పలేకపోయాడు. అంతటితో ఆ ప్రసక్తి ముగిసింది.

• • •

"కృష్ణా, నా జేబులో ముప్పై రూపాయ లుండాలి. అవి కనిపించడం లేదు." మెల్లిగా అన్నాడు సత్యం.

"ఈజిట్ ట్రూ?" ఆశ్చర్యాన్ని వ్యక్తపరిచాడు కృష్ణప్రసాద్. ఆనంద రావు, రామకాంతుకూడా ఆశ్చర్యపోయారు.

"నీకు ఆ చొక్కా జేబు లోనే డబ్బు పెట్టినట్టు బాగా గుర్తుందా?" క్రాస్


# నేషనల్ బుక్ ట్రస్ట్

## నూతన ప్రచురణలు

మన దేశంలోని వివిధ ప్రాంతాల వారి భాష మీకు తెలియక పోయినా, ఆయా భాషల్లో వెలువడిన ఉత్తమ గ్రంథాలు మీరు చదవలేపోయినా, నిరుత్సాహ పడవద్దు. ఆ ప్రాంతీయులు ఎలా జీవిస్తున్నారు, వారి ఆచారాలు, అలవాట్లు ఏమిటి? సామాజిక వాతావరణం ఎలాటిది? అనే విషయాలు తెలుసుకునేందుకు ఇదే సదవకాశం. ప్రసిద్ధ తెలుగు రచయితలు ఆ గ్రంథాలకు చేసిన అనువాదాలు చదివి సమస్త భారతదేశ ప్రజలకి మీరు సన్నిహితులు కాగల సంతోషవార్త. భావాత్మక, సాంస్కృతిక ఐకమత్యం పెంపొందించే "ఆదాన్ ప్రదాన్" శీర్షిక ద్వారా, నేషనల్ బుక్ ట్రస్ట్ ప్రచురించిన కొత్త పుస్తకాలు:

| | | రూ. పై. |
|---|---|---|
| బ్రాహ్మణ కన్య (శ్రీధర్ వెంకటేశ కేత్కార్) | కనకమేడల | 5—00 |
| కెరటాలు (కల్కి) | వాకాటి పాండురంగరావ్ | 7—50 |
| కవి (తారాశంకర బందోపాధ్యాయ) | పిలకా గణపతిశాస్త్రి | 4—70 |
| పంజాబీ కథలు (హరభజన్‌సింగ్) | ఆరిగపూడి | 3—50 |
| ప్రాచీన లక్ష్మి (అబ్దుల్ హలీమ్ షరర్) | దాశరథి | 7—00 |
| మరణానంతరం (శివరామ కారంత్) | తిరుమల రామచంద్ర | 4—00 |

పుస్తకములు దొరకు చోటు:

విక్రేత అధికారి
నేషనల్ బుక్ ట్రస్ట్,
ఎ—5, గ్రీన్ పార్కు, కొత్తఢిల్లీ-16.

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్సు
రాష్ట్రపతి రోడ్డు, సికింద్రాబాదు.

ఎగ్జామినేషన్ ప్రారంభించాడు కృష్ణప్రసాద్.

"బాగా గుర్తుంది. ఎందుకైనా మంచిదని మిగతా చొక్కా జేబులుకూడా వెతికాను. ఎక్కడా కనిపించలేదు."

మిత్రులంతా కలిసి రూమ్ అంతా వెతికి చివరికి డబ్బు పోయిందని నిశ్చయానికి వచ్చారు.

డబ్బు తీయడానికి ఎవరికి అవకాశం ఉంది? కృష్ణప్రసాద్ తీవ్రంగా ఆలోచించసాగాడు. అతను చిన్నప్పుడు డిటెక్టివ్ సాహిత్యాన్ని ఒక పట్టుపట్టాడు. ఇప్పుడు డిటెక్టివ్ యుగంధర్ అయితే ఏం చేస్తాడని ఆలోచించాడు.

"అవును, వాడికే అవకాశం ఉంది. రాంబాబుకి — పక్కింటి అబ్బాయి. దొంగ రాస్కెల్! కనిపించినప్పుడల్లా "నమస్కారం, మాస్టారూ!" అంటాడు.

"సత్యం, బహుశా ఈ పాడు పనికి కారణం రాంబాబు అయి ఉండాలి."

"ఏ రాంబాబూ? మన పక్కింట్లో ఉంటాడు, సెకండ్ ఫారమ్ చదువుతున్నాడు—వాడా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు సత్యం.

"అవును— వాడే! నిన్న రోడ్డు మీద కనిపించి చేతిలో ఉన్న కాంపోజిషన్ బుక్స్ ఇంట్లో పెడతానంటే తాళాలు ఇచ్చాను."

"నా డసలే రౌడీవెధవ!" అగ్నిలో ఆజ్యం పోశాడు ఆనందరావు.

కృష్ణప్రసాద్ ముఖం ఎరుపెక్కింది. ఆవేశంతో ఊగిపోయాడు. "ఛ...వెధవ సమాజం! పిల్లలంటే దేముడంటారు కదా! పన్నెండేళ్ళుండవు వెధవకి. అప్పుడే దొంగతనమా? ఈ సమాజం కుళ్ళి పోయింది. దీనిని వేళ్ళతో సహా పీకి పారెయ్యాలి. ఆ పని ఒక్క ఆయుధం ద్వారానే జరుగుతుంది."

"కృష్ణా! ఉత్తినే ఆవేశపడి సమాజాన్ని దుమ్మెత్తి పోయకురా?" అంటూ సత్యం మందలింప చూశాడు.

* * *

"రామశాయీ! మీ చేతివి వాచీ ఏది?" ఆత్రతగా ప్రశ్నించాడు సత్యం.

"పోయింది." బెరుగ్గా సమాధానం చెప్పాడు.

"ఎప్పుడు? ఎలా పోయింది?" ప్రశ్నల వర్షం కురిపించాడు కృష్ణప్రసాద్.

"అది సరిగ్గా తిరగటం లేదు. అందుకని నిన్న పొద్దున్న డ్రాయరు మీద పెట్టాను. మళ్ళీ రాత్రి చూస్తే కనిపించలేదు."

కృష్ణప్రసాద్ చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. వాచీ ఎలా పోయింది? ఎవరికి తీయడానికి అవకాశం ఉంది?

ఒకటి జరిగి ఉంటుంది. నిన్న రాత్రి తాము ముగ్గురూ సినిమాకు వెళుతూ రామశాయి వస్తే ఇమ్మని రూమ్ తాళం ఆచారికి ఇచ్చి వెళ్ళారు. ఎవరూ లేకుండా చూసి ఆచారే ఈ పని చేసి ఉంటాడు.

కృష్ణప్రసాద్ తన అభిప్రాయాన్ని స్నేహితులతో చెప్పాడు. వాళ్ళు మాటాడలేదు.

"ఉండండి — ఇప్పుడే వెళ్ళి అడిగి వస్తాను." ఉద్రేకంగా లేచాడు కృష్ణప్రసాద్.

"కృష్ణా! ఈ మధ్య నీకు బ్లడ్ ప్రెషర్ ఎక్కువయింది. ప్రతిదానికీ ఆవేశపడిపోతున్నావు. ఆచారి ఆ వాచీ తీశాడని సాక్ష్యం ఏమిటి? ఒక విధంగా చెప్పాలంటే, ఆ వాచీ తియ్యడానికి ఆచారి కంటె మనకే ఎక్కువ అవకాశం ఉంది."

కృష్ణప్రసాద్ నీరసంగా కుర్చీలో జారగిలబడిపోయాడు.

"నువ్వు చెప్పింది నిజమే!" ఆఖరికి ఎలాగో ఒప్పుకున్నాడు.

అయిదు నిమిషాలు నిశ్శబ్దం రాజ్యం చేసింది.

"దీని కేదో ఒక పరిష్కారం చూడాలి" అన్నాడు ఆనందరావు.

మిగతా ఇద్దరి మనసుల్లోను కూడా అదే అభిప్రాయం ఉంది.

"అవును. అతను మనకు 'గెస్ట్'. అతని సరుకు పోతే మనందరం కలిసి ఎలాగో ఓలాగ దాన్ని భర్తీ చెయ్యాలి." కృష్ణప్రసాద్ కంఠం దృఢంగా ఉంది.

"రామశాయితో కలిపి నలుగురు నాలుగు ఏభైలు వేసుకుంటే కొత్త వాచీ వస్తుంది." సజెస్టు చేశాడు సత్యం.

"అలా కాదు. ఇప్పుడే కొనిచ్చెయ్యాలి. కావాలంటే నే నప్పు ఇస్తాను" అన్నాడు కృష్ణప్రసాద్.

## ముళ్ళపూడి నాగేశ్వరరావు

రామశాయి ముఖం పాలిపోయింది. పెదాలు వణికాయి. కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి.

"మీరు ఉత్తినే ఏమిటో ఆలోచిస్తున్నారు. నా అజాగ్రత్త వల్ల నా వాచీ పోవడ మేమిటి, మీరు కొనివ్వడ మేమిటి?" మెల్లగా అన్నాడు రామశాయి—

"అలాగనకండి. మీరు వద్దన్నా కొనక మానం. అది మా విధి. మీ రింకేం చెప్పకండి. మీది పోతే ఒకటి, మాది పోతే ఒకటీనా? మిత్రుడిగా ఆమాత్రం సహాయం చెయ్యకపోతే మే మెందుకు? అన్నిటిలోకి పవిత్రమైనది, దృఢమైనది స్నేహబంధం. అందుకే ఎవరో మధుర కవి 'సృష్టిలో తీయనిది స్నేహమేనోయ్' అన్నాడు. 'ఇఫ్ యు హేవ్ ఎ గుడ్ ఫ్రెండ్ యు హెవ్ ఎ గ్రేట్ వెల్త్' అన్నా డొక ఇంగ్లీషు మహా కవి—బహుశా షేక్స్పియర్ ..." ఇలా సాగిపోయింది కృష్ణప్రసాద్ ఉపన్యాసం.

ఆ రాత్రి రామశాయికి నిద్దర పట్టలేదు. ఏవో ఆలోచనలు. 'ఎంత మంచి వాళ్ళు! ఎంత మంచివాళ్ళు!!' తనలో తను గొణుక్కున్నాడు.

● ● ●

మరునాడు రామశాయి ఆఫీసుకు వెళ్ళలేదు. సత్యం కారణం అడిగితే, తల పోటన్నాడు.

సాయంత్రం మిత్రులు గదికి వచ్చేటప్పటికి రామశాయికాని, అతని సామాను కాని ఆ గదిలో కనిపించలేదు. కాని, వారి కోసం ఒక ఉత్తరం ఎదురుచూస్తుంది.

"ఫ్రెండ్స్,

మిమ్మల్ని ఇలా సంబోధించడానికి నాకు అర్హత ఉందా, లేదా? అని చాలా సేపు ఆలోచించి చివరికి ఈ సాహసం చేశాను. నా సాహసానికి క్షమించండి.

నేను ఇక్కణ్ణుంచి మీకు ఎవ్వరికీ కనిపించకుండా వెళ్ళిపోతున్నాను. దానికి చాలా కారణా లున్నాయి. నేను పాపిని, పతితుణ్ణి, మిత్రద్రోహిని. నా పాపాలు క్షమింపరానివి. ఇన్నాళ్ళూ మీరు చూసింది అసలు రామశాయిని కాదు; మేకతోలు కప్పుకున్న పులిని. నేను చిన్నప్పటినించి మోసాలలో పెరిగి మోసగా ణ్ణయ్యాను. నాకు ఒక ముసలి తల్లి, ఇద్దరు పిల్లలు, పెళ్ళాం ఉన్నారు. నేను వాళ్ళకి ఏమీ పెట్టకపోగా, వాళ్ళని పీడించుకుని తినే క్షుద్రజీవిని. నా కిక్కడ ఏ ఉద్యోగం లేదు. రకరకాలుగా ప్రజల్ని నమ్మించి మోసం చెయ్యడం నా వృత్తి. అందులో ఒక పద్ధతి మీ మీద ప్రయోగించాను. అదేమిటంటే, మిమ్మల్ని బాగా నమ్మించి మీ దగ్గరున్న దంతా ఎత్తుకుపోవడం. దయచేసి నన్ను అసహ్యించుకోండి. నా మీద ఎవరూ జాలి చూపకండి. నే నొక దౌర్భాగ్యుణ్ణి. నాకు లేని వ్యసనం లేదు. నేను పేకాడతాను.

సత్యం డబ్బు తీసింది నేనే. అది పేకాటలో హరించుకు పోయింది. మీరు నన్ను ఏమాత్రం అనుమానించకపోగా, ఎవరో అమాయకుణ్ణి దొంగగా నిర్ణయిస్తే నే నెంత క్షోభపడ్డానో ఆ భగవంతుడికే ఎరుక. కాని, నాలోని బలహీ



గాలికి...
చిత్రం— ఎ. ప్రభాకర్ (జగిత్యాల)

నతలు నన్ను అదిమి పట్టి నిజాన్ని చెప్పనీయలేదు.

తరవాత వాచీ — అది కూడా పేకాటలో హరించుకు పోయింది. మళ్ళీ అబద్ధం. నా మీద నాకు అసహ్యం పేరుకుపోయింది. మీ మంచితనం, ఆత్మీయత నన్ను కదిలించివేశాయి. అందరూ డబ్బు వేసి నా వాచీ కొంటారని మీరు అంటూంటే నేను ఇంకా ఎలా బ్రతికి ఉన్నాను? ఎందుకు బ్రతికి ఉన్నాను? అని లోలోపల ఏడ్చాను.

చిన్నప్పుడు నా స్నేహితులందరని కూడా సిగరెట్టు కాల్చేవాళ్ళం. ఎవరైనా కొత్తవాడొస్తే వాణ్ణి కూడా అందులోకి దించే వాళ్ళం. మా చెడ్డతనానికి తట్టుకోలేక కొందరు మా మంచి [illegible] పోయే వారు. నలుగురు చెడ్డవాళ్ళ మధ్య ఒక మంచి వాడు మంచివాడుగా నిలవ లేడు. అది నాకు అనుభవమే!

కాని, మీ మంచితనం ... మీ ముగ్గురు మంచివాళ్ళ మధ్య ఈ చెడ్డ వాడు నిలవలేక పోయాడు. మంచివాడుగా మారలేకపోయాడు. అందుకే మీకు దూరంగా వెళ్ళిపోతున్నాను. ఎప్పుడైనా నేను మీ స్మృతిపథంలో మెరిస్తే అది నా అదృష్టం.

ఇట్లు,
—అభాగ్యుడు, రామశాయి." ★